క్లుప్తంగా

'డ్రమ్ సీడింగ్'పై అవగాహన



డ్రమ్ సీడింగ్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి

నెల్లిమర్ల రూరల్: మండలంలో తంగుడుబిల్లిలో డ్రమ్ సీడింగ్ విధానంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ మండల సమన్వయకర్త రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డ్రమ్ సీడింగ్ పద్ధతితో ఎకరాకు రూ.6 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. అన్నదాతలు ఈ విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

'లవ్ రీడింగ్'కు స్పందన



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన లవ్ రీడింగ్ కార్యక్రమానికి స్పందన లభించింది. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు పలు రకాల కథల పుస్తకాలు చదివారు. క్యారమ్స్, స్నేక్స్ అండ్ ల్యాడర్ వంటి ఇండోర్ గేమ్స్ కూడా ఆడారు. విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ బిస్కెట్‌లను అందించారు.

బీజేపీ నేత వ్యాఖ్యలు అభ్యంతరకరం

విజయనగరం పూల్‌భాగ్: పారిస్ ఒలింపిక్స్‌లో 100 గ్రాముల బరువు ఎక్కువైందని అనర్హత వేటుకు గురైన వినేష్ ఫోగట్ మానసికంగా కంగిపోతుంటే.. బీజేపీ నాయకుడు విశాల్ ఒక మహిళ అని చూడకుండా బట్టలు విప్పేస్తే వంద గ్రాముల బరువు తగ్గిపోతుందని మాట్లాడడం సరికాదని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ అన్నారు. విశాల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదర రావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీతను పఠిస్తే చెడుగీతలు చెరిగి పోతాయన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ బిజీ జీవితంలో పడి మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని దైవ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట అనాథ వృద్ధాశ్రమానికి రెండు ఫ్యాన్లను దాతలు వితరణ చేశారు. తెర్లాం మండలంలోని బూరిపేటకు చెందిన సర్పంచ్ బూరి మధుసూదనరావు వాటిని నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. దాలయ్య, దివ్యల వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వాటిని అందించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు.

క్రీడాపోటీలు

బొబ్బిలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పలు క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. షాట్‌పుట్ క్రీడలో శంబంగి నాగేశ్వరరావు, మండల రమేష్, గర్భాపు అనిల్‌లు, క్రికెట్‌లో ఆనెం శ్రీను అవెంజర్స్ జట్టు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.విజయగౌరి, కె.కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ వేడుకలు ప్రారంభం

బొబ్బిలి: స్థానిక ఓంశాంతి బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో రాఖీ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మౌంట్ ఆబూ నుంచి దాదీజీ పంపించిన రాఖీలను కేంద్రం ఇన్‌చార్జి రాజేశ్వరి, కౌన్సిలర్ రాంబార్కి శరత్ చేతులమీదుగా రాఖీలు ఆవిష్కరించారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి, అక్కడి అధికారులకు రాఖీలు కట్టి, రక్షాబంధన్ గొప్పతనం వివరించనున్నట్లు వారు తెలిపారు.

ఆరోగ్యం మొలకెత్తాలి...

- మొలకెత్తిన గింజల్లో పోషకాలు
- మారుతున్న ఆహారపు అలవాట్లు



మొలకెత్తించిన తృణధాన్యాలు

విజయనగరం: ఆహార అలవాట్లు, నియమాల విషయంలో చాలామంది ఓ నిర్ణయానికి రాలేకపోతుంటారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి పడుకునే ముందు తినాల్సిన పదార్థాల విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతుంటారు. ఫలితంగా కొందరు ఎక్కువ కేలరీలున్న ఆహారం తీసుకుంటే.. మరికొందరు డైటింగ్ పేరిట కడుపు మాడ్చుకుంటున్నారు. దీంతో శరీర బరువులో మార్పులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తృణధాన్యాలను నానబెట్టి మొలకలు వచ్చాక తినడం ఎంతో ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. పెసలు, శనగలు, గోధుమలు లాంటి గింజలు మొలకలు వచ్చిన తర్వాత తినడం వల్ల శక్తి చేకూరుతుందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడా మైదానాలు, హోటళ్లు, బేకరీల్లో మొలకెత్తిన గింజల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

పోషకాల నిధి..

మొలకెత్తిన గింజల్లో ముఖ్యంగా జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైమ్‌లు అధికంగా ఉంటాయి. ఈ ఎంజైమ్‌లు ప్రొటీన్లను, శరీరానికి ఉపయోగపడే ఎమైనో ఆమ్లాలను, పిండి పదార్థాన్ని అందిస్తాయి. మొలక ధాన్యాల్లో ఎ, బి, సి విటమిన్లు అత్యధికంగా లభిస్తాయి. ఇందులో ఉండే విటమిన్ కె రక్తం గడ్డ కట్టడానికి, కాలేయం పనితీరు సక్రమంగా జరగడానికి తోడ్పడుతుంది. మొలకెత్తిన గింజధాన్యాలు త్వరగా జీర్ణమవుతాయి. పెసలు, శనగలు, జొన్నలు, గోధుమల్లాంటి తొక్కలేనివి... వేరుశనగ, బఠాణీలు, సోయాబీన్, చిక్కుడులాంటి తొక్క ఉన్న గింజలను మొలకెత్తించడానికి తేమ, కొంత వెచ్చదనం అవసరం.

మొలకెత్తించే విధానం..

నాణ్యమైన గింజలను బాగా కడిగి నీళ్లలో నానబెట్టాలి. గింజల పరిమాణాన్ని బట్టి 6 నుంచి 10 గంటలు నీళ్లలోనే ఉంచాలి. గింజలు బాగా నానిన తర్వాత పైన పొట్టుపోకుండా ఒకటికి రెండు మార్లు కడగాలి. వాటిని ఓ తడిబట్టలో పోసి మూట కట్టాలి. తడి ఆరిపోకుండా అప్పుడప్పుడూ నీళ్లు చల్లుతుండాలి. వేసవిలో త్వరగా మొలకలు వస్తాయి. మిగిలిన కాలాల్లో ఒక రోజు నుంచి రెండు రోజులు కూడా పట్టవచ్చు.

ప్రయోజనాలెన్నో..

- శరీరాన్ని రక్షించే యాంటి ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి.
- క్షార గుణం ఎక్కువ. శరీర కణాలను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.
- పీచు పదార్థం, ఇనుము, నియాసిన్, కాల్షియం, పాస్పరస్, విటమిన్లు, ఎంజైమ్‌లు, ఖనిజ లవణాలు మెండుగా ఉంటాయి.
- గర్భిణులు మొలకలు తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు.
- పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది.

జంక్ ఫుడ్ అనారోగ్యకరం

జంక్ ఫుడ్ విపరీతంగా తినడంతో పలు రకాల అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. పంటల సాగులో వాడిన క్రిమిసంహారక మందుల అవశేషాలతో కలుషితమైన ఆహార పదార్థాలను మనకు తెలియకుండానే తీసుకుంటున్నాం. కల్తీ లేకుండా సులభంగా జీర్ణమయ్యే సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం ఉత్తమం.

– శ్రీనివాసరావు, వైద్యుడు

రోడ్డు మధ్యలో గుంత



వైఎస్సార్ జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంత

విజయనగరం : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంత నుంచి ప్రమాదం పొంచి ఉంది. వైఎస్సార్ జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో సుమారు 3 అడుగుల పొడవున గుంత ఏర్పడింది. స్థానికులు ఆ గుంతను మట్టితో పూడ్చినా, నిత్యం వాహనాల రాకపోకల వల్ల ఆ మట్టిసైతం రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ మార్గంలో చిన్న వాహనాలపై ప్రయాణించే వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐక్య విద్యార్థి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా స్థానిక విజ్జి స్టేడియంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ, ఈ దేశంలో 1936 ఆగస్టు 12న మొదలైన విద్యార్థి ఉద్యమాలు నేటి వరకు కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలని ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రమేష్, ప్రతినిధులు మురళి, రాహుల్ పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

బొబ్బిలి రూరల్: హిందూ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర సాధుసంత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి కోరారు. మండలంలోని నారసింహునిపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన పూర్ణకలశ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన ఆయన భక్తులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. బలవంతపు మతమార్పిడిలతో సమాజానికి చాలా ప్రమాదకరమన్నారు. మతం మారడమంటే మన సంస్కృతిని మనం నాశనం చేసుకున్నట్లేనన్నారు. హిందూ మత ఔన్నత్యాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పురోహితులు కె.సూర్యశర్మ, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ప్రచారకులు దూపం వాసు పాల్గొన్నారు.

పశువుల సంచారంతో ఇబ్బందులు



రాజాం మెయిన్‌రోడ్డులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న పశువులు

రాజాం సిటీ: పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే పశువులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అకస్మాత్తుగా వాహనాలకు అడ్డుగా రావడంతో పాటు ఒక్కోసారి వాహనదారుడి మీదికి కూడా దాడికి వచ్చేస్తున్నాయని వాపోతున్నారు. మెయిన్‌రోడ్డుతో పాటు చీపురుపల్లి రోడ్డు, బొబ్బిలి రోడ్డు, పాలకొండ రోడ్లపై ఎక్కువగా రాత్రి సమయాల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. గతంలో ఇదే విషయమై ఫిర్యాదులు వెళితే మున్సిపల్ అధికారులు స్పందించి, పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా మళ్లీ ఎప్పటిలాగే మూగజీవాలు సంచరిస్తుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి సాగుతో బహుళ ప్రయోజనాలు

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు



రోలుచప్పిడిలో ప్రకృతి సాగులో వేసిన కాప్సికమ్



ప్రకృతిసాగు పద్ధతిలో భాగంగా వరి పంటలో కాలిబాటలు తీస్తున్న రైతులు



రోలు చప్పిడిలో అగ్నాస్త్రం తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

పూసపాటిరేగ : ప్రకృతి సాగు పద్ధతిలో భాగంగా పంటలు పండించడం వల్ల అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. అధిక పెట్టుబడి, తక్కువ దిగుబడులతో విసిగిపోయిన రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పూర్వం ప్రకృతి పద్ధతులతో వ్యవసాయ చేసేవారు. అనంతర కాలంలో చోటుచేసుకున్న పరిణామాల వల్ల రసాయన ఎరువుల వినియోగం ఎక్కువైంది. దీనివల్ల పెట్టుబడులు పెరిగిపోగా.. చీడపీడలతో దిగుబడులు బాగా తగ్గాయి. రసాయన ఎరువులతో పండించిన పంటలు వినియోగించడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగం, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాల తయారీపై రైతులకు శిక్షణ ఇస్తూ రసాయన రహిత ఫలసాయాల ఉత్పత్తికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

సుమారు 800 హెక్టార్లలో ప్రకృతి సాగు

నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో పూసపాటిరేగ మండలంలో అత్యధికంగా ప్రకృతి వ్యవసాయం సాగు జరుగుతోంది. డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లో కూడా ఇటీవల కాలంలో ప్రకృతి సాగు ఊపందుకుంది. రైతులు అవగాహన కార్యక్రమాలు, శిక్షణలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ప్రకృతిసాగులో కూరగాయలు, వరి, జామి, కాప్సికమ్, అరటి, బొప్పాయి వంటి పంటలు సాగు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. జీవన ఎరువులు, కషాయాల తయారీపై ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ద్వారా రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రతి ఏడాదికీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

– కె.నీలిమ, మండల వ్యవసాయ అధికారి పూసపాటిరేగ

మార్పు కోరుకుంటున్నారు..

పంటల సాగు విధానంలో రైతులు మార్పు కోరుకుంటున్నారు. గతంలో అధిక దిగుబడులు కోసం రసాయన ఎరువులు వినియోగిస్తే ఇప్పుడు దుష్ఫలితాలు తెలుసుకుని ప్రకృతి సాగు విధానంపై మక్కువ పెంచుకుంటున్నాం. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఎటువంటి హానిలేని ప్రకృతి సాగుపట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

– ఎం. రామునాయుడు, రైతు, పతివాడ

రహదారికి పచ్చని మణిహారం



టొంపలపేట వద్ద రోడ్డుకిరువైపులా పచ్చగా కనిపిస్తున్న మొక్కలు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక టొంపలపేట వద్ద రోడ్డుకిరువైలా నాటిన మొక్కలు పచ్చగా సుందరంగా దర్శనమిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద కొన్నేళ్ల కిందట టొంపలపేట నుంచి గొర్లిపేట వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. టొంపలపేట గ్రామస్తులు మొక్కలను సంరక్షించడంతో సుమారు 800 మీటర్ల వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. పచ్చని మొక్కలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

రిజర్వేషన్లను కాపాడుకోవాలి..

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

విజయనగరం ఫోర్ట్: మాలలంతా ఏకమై రిజర్వేషన్లను కాపాడుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. నగరంలోని మాల మహానాడు కార్యాలయంలో మాల మృతవీరుల సంస్మరణ దినం ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు మాల మృతవీరుల చిత్రాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. 1997 ఆగస్టు 11న హలో మాల – చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టగా లక్షలాది మంది వచ్చారన్నారు. మాలలంతా లక్షలాదిగా హైదరాబాద్ చేరుకోవడంతో బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద పోలీసులు ఇనుప ముళ్ల కంచెలు వేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. వాటిని దాటుకుని వెళ్లిన వారిపై భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించారని తెలిపారు. అప్పటికీ మాలలు ఆగకపోవడంతో పోలీసులు జరపడంతో నలుగురు మృతి చెందగా.. వేలాది మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏడాదీ ఆగస్టు 11న మాల మృతవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నట్లు చెప్పారు. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశం తెరమీదకు వచ్చిందన్నారు. వర్గీకరణ రాష్ట్రంలో అమలు కాకుండా మాలలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చోళ్ల సింహాచలం, మైలపల్లి నాగరాజు, ఎస్.ఆనంద్, ఎ. మురళి, కె. విజయలక్ష్మి, బి. పద్మావతి, జె.సావిత్రి, జి. తులసి, పి.సూరిబాబు, సునీత, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వ్యతిరేక విధానాలు విడనాడాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

విజయనగరం: దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు ఒకటో తేదీన వెలువరించిన ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణను ఆంధ్రప్రదేశ్‌లో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం సమర్థించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ప్రతినిధి బొంగ భానుమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 341ను సవరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని.. రాష్ట్రానికి లేదని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన ప్రతిసారీ ఎస్సీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి విగాథం కలిగిస్తోందన్నారు. ఇటువంటి చర్యలను తక్షణమే విడనాడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.

గతుకుల రహదారితో ఇక్కట్లు



పాడైన తంగుడబిల్లి గ్రామానికి వెళ్లే రహదారి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటర్ పొడవున ఉన్న ఈ రహదారిలో అడుగుకో గుంత దర్శనమిస్తోంది. దీంతో ఆ రహదారిలో వెళ్లేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ఉన్న భవానీ స్వయంశక్తి సంఘ మహిళలకు ఫార్మా మోడల్ విధానం ద్వారా కూరగాయల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. సంవత్సరం పొడవునా ఆకుకూరలు, కూరగాయలు ఎలా పండించాలి, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఎలా సంపాదించాలన్న విషయాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పార్వతమ్మ, గౌరీశ్వరరావు, తవిటినాయుడు, రమణలు వివరించారు. ప్రతిఒక్కరూ సేంద్రియ ఎరువులు వాడాలని, వీటి ద్వారా ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.